క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పోరుమామిళ్ల : అక్కలరెడ్డిపల్లె పంచాయతీలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్‌లు పాల్గొంటారని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలన్నారు.

రేపు ఉచిత ఆక్యుపంక్చర్ చికిత్సా శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధీ రోడ్డులోని రాయలసీమ ఫర్నిచర్స్‌లో శనివారం సాయంత్రం సాయంత్రం 4 నుంచి 7 వరకు ఉచిత ఆక్యుపంక్చర్ చికిత్సా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గాజుపల్లె పెద్దసుబ్బయ్య పెద్ద సుబ్బమ్మ సేవా సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు ఓ ప్రకటనలో తెలిపారు. కీళ్లు, నరముల, కిడ్నీ, యూరినరీ, సమస్యలు, తిమ్మిర్లు, షుగర్, మెడనొప్పి తదితర వాటికి ఆక్యుపంక్చరిస్ట్ వెంకటరాముడు వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రతి నెల రెండవ, నాలుగవ శనివారం ఈ ఉచిత వైద్య శిబిరం ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామ పంచాయతీలకు మహర్దశ

పోరుమామిళ్ల : గ్రామ పంచాయతీలకు కేంద్రం ఇస్తున్న నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలోనే జమ కానున్నందున ఇకపై గ్రామ పంచాయతీలు అభివృద్ధి పనులు చేపట్టి ముందుకు పోయేందుకు అవకాశం కలిగిందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉట్టి శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 12,000 గ్రామ పంచాయతీలు స్టేట్ బ్యాంకులో ఖాతాలు తెరిచాయని, ప్రతినెల వచ్చే దాదాపు రూ.300 కోట్లు పంచాయతీ ఖాతాలో జమ అవుతాయన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టినట్లేనన్నారు. సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు పల్లెంశెట్టి పండరి, జిల్లా కార్యదర్శి రమణాచారి, మండల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవిశంకర్

దువ్వూరు : ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖాధికారి రవిశంకర్ తెలిపారు. మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట ఎమ్మార్సీ భవనంలో గురువారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే పుస్తకాలను విక్రయించాలని, ఫీజులు వసూలు చేయాలని తెలిపారు. నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 భాస్కర్, ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత



ఆర్‌వో ప్లాంట్‌ను నీటిని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

బి.కోడూరు : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మౌలిక వసతులైన తాగు నీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎండీ/ఎస్‌ఆర్‌ఈడీసీఏపీ రూ.6 లక్షల నిధులతో ఆర్‌వో ప్లాంట్‌ను మండల ఉపాధ్యక్షుడు, సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి, మూలవారిపల్లె వాటర్‌షెడ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డిల చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, పద్మనాభరెడ్డి, ఎం.సిద్దేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రహల్లాదరెడ్డి, సుధాకర్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ కార్యాలయం వద్ద ఆర్ఎస్‌యూ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంతవరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. దీంతోపాటు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉర్దూ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరి, రమేష్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రతి గడపకూ

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రతి గడపకు వస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని సిద్దారెడ్డిపల్లె, ద్వారకానగరం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు హజరత్ రెడ్డి, వీరారెడ్డి, రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని తెలియజేస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బెంగళూర్ – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన గయాల్ భూముల బాధితులు పరిహారం అందించాలని, ధరలను పెంచాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించి, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా ఈనెలా 24వ తేదీ నుంచి జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో పలు చోట్ల సిమెంటు రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరగా, స్పందించిన ఎమ్మెల్యే రోడ్లు నిర్మించేందుకు నివేదికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి మంజూరైన సంక్షేమ పథకాల వివరాల సంక్షేమ బావుటాను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామాంజనేయులు రెడ్డి, సుబ్బరామిరెడ్డి, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఉచితంగా సర్టిఫికెట్ల మంజూరు



మైదుకూరు: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి

మైదుకూరు : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయాల్లో విద్యార్థులు, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా మంజూరు చేయనున్నట్లు మైదుకూరు మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి తెలిపారు. గురువారం మైదుకూరులోని మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అనేక పథకాలు ఇస్తున్నప్పటికి ఆ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లు ప్రజల దగ్గర లేకపోవడంతో అర్హులై ఉండి కూడా పథకాలను పొందలేకపోతున్నందున అవసరమైన సర్టిఫికెట్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, మున్సిపల్ ఏఈ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' శ్రద్ధగా నిర్వహించాలి

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో శ్రద్ధగా నిర్వహించాలని మండల జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన పోరుమామిళ్ల సచివాలయం 1,2,3లలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అర్హత ఉండి లబ్ధి చేకూరని ప్రతి ఒక్కరికీ ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందుకు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు 24వ తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి సమస్యలు గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు గంగయ్య, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం

కాశినాయన : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతున్న జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. 11 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే తేదీల వివరాలను తెలిపారు. రెండు టీంలుగా ఏర్పడి ప్రారంభిస్తామన్నారు. జూలై 1వ తేదీన గొంటువారిపల్లె, గంగనపల్లె, 5న కత్తెరగండ్ల, కొండ్రాజుపల్లె, 11న నరసాపురం, కోడిగుడ్లపాడు, 14న వరికుంట్ల, రంపాడు, 18న ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె, 22వ తేదీన వద్దమాను సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అత్యవసర రోగులకు వెంటనే చికిత్స అందించాలి

ప్రొద్దుటూరు : జిల్లా ప్రభుత్వా ఆస్పత్రిలో అత్యవసర రోగులకు వెంటనే చికిత్సలు అందించాలని అవినీతి వ్యతిరేక సమితి అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుతో ఆయన మాట్లాడి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అవినీతి వ్యతిరేక సమితి సభ్యులు వెంకటపతి, నీలకంఠరెడ్డి, ప్రతాప్ యాదవ్, నారాయణ రెడ్డి, గౌస్, నరసింహారెడ్డి, బాషా పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి నిరంతర పోరాటం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు దళితవాడలో గురువారం మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు బిద్రు చెన్నయ్య ఆధ్వర్యంలో దళితుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి రాష్ట్ర అధ్యక్షుడు నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 30న మహా ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30 ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయం ఆవరణలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సీమలోని వెనుకబడిన జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాలో కౌలు రైతులందరికీ గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వ పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపచేయాలని ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షులు గోపాలకష్టయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు చిన్న సిద్ధయ్య శ్రీనివాసులురెడ్డి సుబ్బారెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డిగ్రీలో సింగిల్ సబ్జెక్ట్ మేజర్ సబ్జెక్టు విధానం రద్దు చేయాలని, త్రీ సబ్జెక్టు విధానం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభించి 20 రోజులు పూర్తవుతున్న నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

11 మంది అరెస్ట్

కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 19న కొండాయపల్లి సమీపంలో పెప్సీ గోడౌన్‌పై దాడి కేసులో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. షేక్ మహబూబ్ తాజుద్దీన్, సలీం, షేక్ ఖాజా, బాలరాజు, వీరవంశీ, రాజేష్, తాజ్‌బాబా, రియాజ్, మౌలాలి, షావల్లీ, పీరుల్లాలను అరెస్ట్ చేశారు. నిందితులలో ప్రధానంగా వెంకటేశ్వర్ నాయుడు, ఓ టీ.వి ఛానెల్ కడప టౌన్ రిపోర్టర్ (సాక్షి కాదు), ఇంకా కొంతమంది ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

త్వరలో గోపి రైస్‌మిల్లు రోడ్డు విస్తరణ



విస్తరించనున్న గోపిరైస్ మిల్లు రోడ్డు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని గోపిరైస్ మిల్లు రోడ్డు విస్తరణ పనులను త్వరలో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇంటింటా సర్వే జరుగుతోంది. చేనేతలు ఎక్కువగా నివసించే గోపిరైస్ మిల్లు రోడ్డు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మున్సిపల్ పాలకవర్గం చర్యలు చేపట్టింది. బొల్లవరంలోని బస్ షెల్టర్ నుంచి రిషి అపార్ట్‌మెంట్, గోపిరైస్ మిల్లు రోడ్డు, ఆర్ట్స్ కాలేజి రోడ్డు మీదుగా రామేశ్వరం మోరీల వరకు 60 అడుగుల వరకు రోడ్డును విస్తరించాలని మాస్టర్ ప్లాన్‌లో సూచించారు. ఇందుకు అనుగుణంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలను నిర్మించి రోడ్డును విస్తరించేందుకు గత కౌన్సిల్ సమావేశంలో తీర్మాణం చేశారు. రోడ్డు విస్తరణ, డివైడర్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ కోసం తొలి విడతగా సుమారు రూ.3 కోట్లతో టెండర్లు పిలిచారు. వీలైనంత త్వరలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

740 మీటర్ల పరిధిలో విస్తరణ పనులు

గోపి రైస్‌మిల్లు రోడ్డులో తొలి విడతగా 740 మీటర్ల వరకు 60 అడుగుల రోడ్డును విస్తరించి డ్రైనేజి కాలువలను నిర్మిస్తాం. మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టం పెడతాం.

– సాయికృష్ణ, మున్సిపల్ ఇంజనీర్, ప్రొద్దుటూరు

డిమాండ్ ఉన్న పంటలనే సాగుచేయాలి



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, ప్రసాదరెడ్డి

పోరుమామిళ్ల : రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగుచేయాలని రాష్ట్ర ఉద్యాన పంటల సలహాదారులు సంబటూరు ప్రసాదరెడ్డి రైతులకు సూచించారు. గురువారం ఆయన కేవీకే శాస్త్రవేత్తలతో కలసి పోరుమామిళ్ల మండలం పుల్లివీడు, కాశినాయన మండలం ఇటుకుళ్లపాడు గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. వ్యవసాయ అనుబంధశాఖల ద్వారా అమలు జరుగుతున్న వివిధ పథకాల అమలు తీరుపై రైతులతో చర్చించారు. రైతులు ఉద్యాన అధికారుల సలహాలకు అనుగుణంగా సాగుచేయాలని, పంట రకం ఎన్నిక నుండి సాగు, మార్కెటింగ్ వరకు ప్రతి దశలో అనుభవ రైతులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని వ్యవసాయం చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. బోరు ఉన్న రైతులు డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలని, అందుకు ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. రైతులకు ఆర్‌బీకే సహాయకులు సహకారం అందించాలన్నారు. పారదర్శకంగా పనులు జరిగేలా చూడాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలసి ఆయన జామతోటలో పండు ఈగ సమస్యలు గుర్తించారు. నివారణకు సలహాలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా ఉద్యానాధికారి సుభాషిణి, ఏడీఏ మురళీధర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, డాక్టర్ వీరయ్య, డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ భవనం

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలోని పాత పోలీసు క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ భవనాన్ని శుక్రవారం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఫ్యామిలీపరమైన కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు గతంలో మైదుకూరు డీఎస్పీ కార్యాలయానికి వెళ్ళాల్సి వచ్చేది. అయితే బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన నేపథ్యంలో బద్వేలు కేంద్రంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించిన నేపథ్యంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్, అర్బన్ సీఐ వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో ఓ పాత పోలీసు క్వార్టర్స్ భవనాన్ని ఆధునీకరించి సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ వారంలో మూడు రోజుల పాటు డీఎస్పీ అందుబాటులో ఉండనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డిలు పాల్గొంటారని తెలిపారు.

రామసముద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

బి.కోడూరు : మండలంలోని రామసముద్రం సచివాలయంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, షుగర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన వారిని పరీక్షించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలకు రక్తపరీక్షలు నిర్వహించి అనీమియా ఉన్న వారికి ఐరన్, కాల్షియం మాత్రలు, చిన్నపిల్లలకు ఐరన్ సిరఫ్‌లు అందజేశారు. 122 మందికి వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జయంతి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, సచివాలయ ఏఎన్‌ఎం రేష్మ, కంప్యూటర్ ఆపరేటర్ నాగేశ్వర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు లక్ష్మిదేవి, మస్తానమ్మ పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవు



నాగులచెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డుతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాగులచెరువులో ఎవరైనా వ్యర్థాలు వేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం బైపాస్ రోడ్డులోని నాగులచెరువును పరిశీలించిన ఆయన మాట్లాడుతూ చెరువులో ఇష్టానుసారంగా వ్యర్థాలు వేయడం వలన నీరు కలుషితమవడంతో పాటు దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇకపై ఎవరైనా చెరువులో వ్యర్థాలు వేస్తే వారికి జరిమానా విధిస్తామన్నారు.. ప్రస్తుతం ఉన్న వ్యర్థాలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. పట్టణంలోని హోటల్, చికెన్, చేపల మార్కెట్ యజమానులు, అరటి పండ్ల మండీలు, కొబ్బరిబోండాల దుకాణదారులు వ్యర్థాలు వేస్తున్నట్లు గుర్తించామని, వారందరికి నోటీసులు ఇచ్చామన్నారు. వ్యాపారస్తులు శివాలయం సమీపంలోని డంపింగ్‌యార్డులో మాత్రమే వ్యర్థాలు వేయాలన్నారు. త్వరలోనే నాగులచెరువు సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి శ్రీరాములు, వైస్‌చైర్మన్ నాగంసుబ్బారెడ్డి, కౌన్సిలర్ వరలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి నరసింహులు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



అధికారులకు అర్జీలు ఇస్తున్న రైతులు

గోపవరం : కాలువపల్లె రెవెన్యూ పొలంలోని భూ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం కాలువపల్లె గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఎంపీడీఓ రామకృష్ణ, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా కాలువపల్లెలో భూ సర్వే నిర్వహించినప్పటికీ పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించలేదని, ఇంకా ఆన్‌లైన్, ఇతర సమస్యలు ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించాలని స్థానిక రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. అలాగే అసైన్‌మెంట్ కమిటీ ద్వారా కొండ భూములు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపించారని, ఆ భూములు పంపిణీ చేస్తే పశువులు మేతకు వెళ్ళేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని, ప్రస్తుతం ఆ భూముల జోలికి పోవద్దని సర్పంచ్ శ్రీనివాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. భూ సమస్యలపై స్పందించిన అధికారులు త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు శుభవార్త



మాట్లాడుతున్న ఈడీ వెంకటసుబ్బయ్య

పోరుమామిళ్ల : ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఆయన పోరుమామిళ్ల రైతు భరోసా కేంద్రంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పని చేసే ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ప్రభుత్వం 8 రకాల విత్తనాలు, రూ.10 వేల విలువ చేసే వ్యవసాయ కిట్లు ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. దీనికి డబ్బు తిరిగి చెల్లించాల్సిన పని లేదన్నారు. జిల్లాలోని ఎస్సీ రైతులందరూ ఎంతమంది ఉన్నా అందరికీ ఈ పథకం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్సీ రైతులు ఈ అవకాశం వినియోగించుకుని ప్రకృతి వ్యవసాయం చేసి ప్రయోజనం పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం రామకృష్ణంరాజు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కుముద పాల్గొన్నారు.

మతసామరస్యంతో పండుగలు నిర్వహించాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : పండుగలను మతసామరస్యంతో, భక్తిభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక అర్బన్‌స్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లీం మతపెద్దలతో గురువారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు, మతపెద్దలు పోలీసులకు సహకరించాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా చట్టాలను గౌరవిస్తూ పండుగ జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఏఎస్ఐ సి.వెంకటేశ్వర్లు, మాస్క్ కమిటీ అధ్యక్షులు అల్లాబకాష్, కార్యదర్శి మౌలాలి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, హిందూ, ముస్లీం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

25న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో 25న ఆదివారం సాయంత్రం 5 గంటలకు టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివి 10వ తరగతిలో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు, సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 950కిపైగా మార్కులు సాధించిన అన్ని గ్రూపుల విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు ఆయన వివరించారు. అర్హులైన విద్యార్థులు పాఠశాల ఐడీ కార్డు, మార్కుల జాబితా తీసుకుని కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం సెల్‌నంబర్ 9248722218, 7780390139కు సంప్రదించాలని కోరారు.

జగనన్న గృహాలను త్వరగా నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆనంద్ నాయక్

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆనంద్ నాయక్, మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో గృహాలను త్వరగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయమ్మ, తహసీల్దార్ నజీర్ అహ్మద్, కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ అవార్డుల రద్దు దేశ ప్రగతికి అడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

కడప కల్చరల్ : సైన్స్ అవార్డులను రద్దు చేయడం దేశ ప్రగతిని అడ్డుకోవడమేనని, శాస్త్ర పురోగతిని భంగ పరిచినట్లని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి తీసుకున్న నిర్ణయం సరికాదని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యువ శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ హోదా గల శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు ఇవ్వడమేనని, ఇలా ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. వాటిని రద్దు చేయడం ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకుని తాను చెప్పినట్లు వినే కీలు బొమ్మలను చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన అని విమర్శించారు. సంస్థ జిల్లా అధ్యక్షులు బాల బయన్న మాట్లాడుతూ పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం, విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపరచకూడదనే భావన పాలకుల్లో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

24న వేలం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప తహసీల్దార్ కార్యాలయంలోని పాత చెక్కలతో చేసిన సామాగ్రి వేలం పాట ద్వారా విక్రయించాలని నిర్ణయించామని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు.